రంగారావు వచ్చి నరసింహం సీటు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. అతని ముఖంలో ఆందోళన, దిగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చలికాలమైనా ఆతని ముఖానికి చెమటలు పడుతున్నాయి. చేరుమాలుతో ముఖం తుడుచుకుంటూ ఉస్సురన్నాడు.

ఏదో ఫైల్‌ని సీరియస్‌గా చూస్తూ మిగతా ఫైళ్ల గోడల మధ్య తలమునక లవుతున్న నరసింహం ఆతని రాకను ముందు గమనించలేదు. ఉస్సురన్న శబ్దం విని తల పైకెత్తి చూశారు.

"రంగారావు! ఏమిటి అల్లా ఉన్నావు? ఇలా వచ్చావేమిటి?" అంటూ జంట ప్రశ్నలు వేశాడు.

"ఏమీ లేదోయ్! ఊరికేనే వచ్చాను" అంటూ నీళ్లు నమిలాడు రంగారావు.

రంగారావు ఊరికే రాడని నరసింహానికి తెలుసు "పర్వాలేదు. చెప్పు. ఏమిటీ సంగతి!" అని మళ్లీ అడిగాడు.

"ఓ ఐదు నిమిషాలు అలా క్యాంటీన్‌కి వెళ్లి మాట్లాడుకుందాం రా!"

"సరే పద" అంటూ ఫైల్ మూసి లేచాడు నరసింహం.

క్యాంటీన్ అంటే మరేదీ కాదు. ఆ ఆఫీసు కాంపౌండ్‌లో చాలా చెట్లున్నాయి. వాటిలో ఒకదాని కింద ఒక చిన్న టీ స్టాల్ ఉంది. అదే క్యాంటీ నన్న మాట. మిత్రు లిద్దరూ రెండు అర కప్పుల టీ తీసుకుని మరొక చెట్టు కింద లాన్‌లో కూర్చున్నారు.



"ఇప్పుడు చెప్పు" అన్నాడు నరసింహం టి కప్పు నోటి దగ్గర పెట్టుకుంటూ.

ఒక్క నిముషం మౌనంగా ఉన్నాడు రంగారావు. ఒక గుక్కెడు టీ తాగి —

"ఏమీ అనుకోకపోతే ఒక సహాయం చేయాలోయ్" అన్నాడు.

"చెప్పు బ్రదర్! మొహమాటపడతావే?" అన్నాడు నరసింహం.

"చాలా అవసరంగా వంద రూపాయలు కావలసి వచ్చింది. నువ్వు సర్దుబాటు చేయగలిగితే ఎంతో ఉపకారం చేసిన వాడవుతావు" అన్నాడు రంగారావు దీనంగా.

"అదేమిటోయ్.. ఇవాళ మూడో తారీకేగా. మొన్ననేగా జీతం తీసుకుంది. అప్పుడే అంతా అయిపోయిందా?" అని ఆశ్చర్యంగా అడిగాడు నరసింహం.

"పేరుకి జీతమే కాని వచ్చేదెంత, మిగిలేదెంత? ఆ కాస్తా అప్పులు తీర్చడానికి, వడ్డీలు కట్టడానికే సరిపోదాయె" అన్నాడు రంగారావు.


రంగారావు పెద్దమనిషే. అయితే పెద్ద సంసారం కలవాడు. బరువులు, బాధ్యతలు చాలా ఉన్నవాడు. అందువల్ల నిత్యమూ అప్పుల్లో మునిగి తేలుతూంటాడని నరసింహానికి తెలుసు. ఇటువంటి మనిషి ఎప్పుడు ఏ విధంగా పైకి వస్తాడా అని ఆలోచించసాగాడు నరసింహం.

"నీ దగ్గర లేకపోతే తటపటాయించకు. ఎవరి దగ్గరైనా వడ్డీకైనా ఇప్పించు" అన్న రంగారావు మాటలతో తిరిగి ఈ లోకంలోకి

# ఊబి

కె.ఆర్.కె. మోహన్

వారం వారం కథాప్రభ



వచ్చాడు నరసింహం.

"వడ్డీకా.. ఎంతిస్తావేమిటి?" అన్నాడు నరసింహం ఆశ్చర్యంగా.

"నెలకి వందకి పది రూపాయ లిస్తాను. ఇది మామూలుగా నే నిస్తున్నదే. అంతకుమించి నే నివ్వలేను. కాని ఇప్పుడు చాలా అవసరం. తప్పనిసరి అయితే ఏం చేస్తాం? ఎంతైనా తప్పదు" అన్నాడు రంగారావు.

"పది రూపాయలు వడ్డీయా? అంటే 120 శాతమా? అంటే ఏడాదిలో అసలు అలా ఉండగా నువ్వు తీసుకున్న వందకి నూట ఇరవై చెల్లగడ్తావన్నమాట. ఇంతింత వడ్డీ లిస్తే నువ్వేమి తింటావు!" అన్నాడు నరసింహం జాలిగా.

"నువ్వు చెప్పింది నిజమే కాని తప్పదు. ఏం చేస్తాను! వడ్డీ లేకుండా ఎవరిస్తారు? అవసరమైన ఖర్చు ఆపలేను కదా?" అన్నాడు రంగారావు.

"హుఁ" అని భారంగా నిట్టూర్చాడు నరసింహం.

"సరే.. ఆ వంద నేనే ఇస్తాను. నాకేమీ వడ్డీ అక్కరలేదు. మరి నాకు తిరిగి ఎప్పుడిస్తావు?" అన్నాడు నరసింహం.

రంగారావు ముఖం సంతోషంతో మెరిసింది. కృతజ్ఞతాపూర్వక దృక్కులతో "చాలా థాంక్స్, బ్రదర్! ఈ నెలలోనే ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఈ నెలలో ఇవ్వలేకపోయినా వచ్చే నెల ఫస్టు తారీఖుకి మాత్రం తప్పక ఇస్తాను. నీ ముందే జీతం తీసుకుని నీ బాకీ అక్కడే తీరుస్తాను" అన్నాడు.

"అంత నా ముందే తీసుకుని ఇవ్వనక్కరలేదు. ఆ మాత్రం నమ్మకం లేందే ఇవ్వనుగా" అంటూ నరసింహం జేచులోనుంచి వంద రూపాయల నోటు తీసి రంగారావు చేతిలో పెట్టాడు.

వారం రోజులు గడిచాయి.

రోజూ పనికట్టుకుని పలుకరించే రంగారావు నరసింహం ముందు ముఖం చాటువేయడం మొదలుపెట్టాడు. పని ఎక్కువగా ఉంటే తీరిక లేక రావడంలేదేమో ననుకున్నాడు నరసింహం. ఆ తర్వాత తెలిసింది రంగారావు ఇంకెవరి దగ్గరో మళ్లీ వడ్డీకి వంద రూపాయలు తీసుకున్నాడని. నరసింహానికి ఆశ్చర్యమూ వేసింది. బాధ కలిగింది. రంగారావుని పిలిచి గట్టిగా అడుగుదామనుకున్నాడు. కాని అడిగితే బాధ పడతాడని, అడిగినా ప్రయోజనం ఉండదనీ ఊరుకున్నాడు. అప్పులు చేయడానికి అలవాటుపడ్డ వాళ్లు అంతేనని సరిపెప్పుకున్నాడు.

ఫస్టు తారీఖు రానే వచ్చింది. తాను వెళ్లి రంగారావుని బాకీ అడగడం పెద్ద తరహా కాదని ఊరుకున్నాడు నరసింహం. అతనే వచ్చి ఇస్తాడని ఎదురు చూడసాగాడు.

సాయంత్రం అయింది. ఆఫీసు కట్టే వేళయింది. అయినా రంగారావు రానేలేదు. సంగతి కనుక్కుందామని అతని సెక్షన్‌కి వెళ్లి వాకబు చేశాడు. రంగారావు ఆ రోజున సెలవు పెట్టాడని తెలిసింది.

అరే పాపం... జీతాల రోజున కూడా సెలవు పెట్టాడంటే ఏ ఇబ్బంది వచ్చిందో ఏమో! అనవసరంగా అతన్ని గురించి ఏవేవో అనుకున్నాను" అని మనసులో బాధపడుతూ వెళ్లబోయాడు నరసింహం.

"ఏమి సార్! రంగారావు మీకు కూడా ఏమైనా ఇవ్వాలా?" అంటూ ముసి ముసి నవ్వులు నవ్వుతూ అడిగాడు సెక్షన్ సూపరింటెండెంట్.

"ఈ రోజు జీతాల రోజు కదండీ. మరి ఆఫీసుకి ఎందుకు వస్తాడు?" అన్నాడు మరో గుమస్తా.


"సెలవు పెడితే మాత్రమేం జీతం తీసుకోవడం మానడుగా" అన్నాడు మరో గుమస్తా.

నరసింహం గుండె గతుక్కుమంది. ఏమీ మాట్లాడకుండా బయటకు వెళ్లాడు. తిన్నగా పే సెక్షన్‌కి వెళ్లాడు. అక్కడ విచారిస్తే రంగారావు పొద్దునే అందరికంటే ముందే జీతం తీసుకుని వెళ్లిపోయినట్లు తెలిసింది.

నరసింహం నివ్వెరపోయాడు. తనూ మామూలు ఉద్యోగే. ఆస్తిపాస్తులు ఉన్నవాడు కాదు. వచ్చేదాన్నే జాగ్రత్తగా ఖర్చు పెడుతూ ఎంతో కొంత నిలువ వేస్తూ గుట్టుగా గడుపుకుని వస్తున్నాడు. అయినా జాలిపడి వంద రూపాయలు ఇచ్చాడు. అదేమీ చిన్న మొత్తం కాదు. రంగారావు చేసిన పని చూసేసరికి ప్రపంచం అంటే రోత కలిగింది నరసింహానికి. మనుషులంటే అసహ్యం వేసింది. అవసరానికి ఆదుకున్న వాళ్లనే మోసం చేసే ఈ ప్రవృత్తి ఏమిటో అర్థం కాలేదు. తాను చేతకాని వాడుగా, ఎందుకూ పనికిరాని వాడుగా అనిపించింది. తన మీద తనకే అసహ్యం వేసింది. తాను వట్టి అమాయకుడని భార్య ఎప్పుడూ అంటూ ఉంటుంది. అది నిజమే ననిపించింది. చికాకుగా ఉన్న మనసుతో ఇంటికి వెళ్లాడు.

మర్నాడు మామూలుగా ఆఫీసుకి వెళ్లాడు నరసింహం. ఆ రోజు కాదు కదా మరో రెండు రోజులు కూడా రంగారావు కనిపించలేదు.

'చూద్దాం... ఎన్నాళ్లు ముఖం చాటేస్తాడో!' అనుకుని ఊరుకున్నాడు.




ఆ రోజు మధ్యాహ్నం అనుకోకుండా ఎదురయ్యాడు రంగారావు.

"నరసింహం! నీ దగ్గరకే వస్తున్నాను. అనుకోకుండా డబ్బు ఖర్చయిపోయింది. అది చెప్పడానికి మొహమాటపడ్డాను. వారం పది రోజుల్లో నీ బాకీ తప్పక తీర్చేస్తాను" అంటూ తనంతట తానే చెప్పుకుని పోసాగాడు.

రంగారావు అన్న వారమూ గడిచింది. పది రోజులూ గడిచాయి. అలాగే మరో రెండు మూడు ఫస్టు తారీఖులు కూడా గడిచిపోయాయి. అయినా రంగారావు నరసింహం బాకీ తీర్చనేలేదు. సమయం కనిపెట్టి పిల్లిలాగా వచ్చి జీతం తీసుకుని చల్లగా జారుకునే వాడు. ఫస్టు తారీఖున అతని పత్తా ఉండదు. ఆ తర్వాత అతని జేబులో పైసా ఉండదు. ఎదురైనప్పుడు మాత్రం ఏవో కుంటిసాకులు చెప్పి తప్పుకునేవాడు.

నరసింహానికి రంగారావు గురించి బాగా తెలుసు. స్వతహాగా అతను పెద్దమనిషే. పరిస్థితులు అతన్ని అలా తయారు చేశాయని జాలిపడేవాడు. తీర్చలేని అతన్ని పీడించి మాత్రం ప్రయోజనం ఏముంటుందని ఇచ్చినప్పుడే తీసుకుందామని అడగడం కూడా మానేశాడు. అసలు ఆ బాకీ గురించి మరిచి పోవాలనుకున్నాడు. నిజానికి నోరు విప్పి అడిగే శక్తి కూడా లేని నైజం నరసింహానిది. అయితే తను ఏ వడ్డీ కూడా లేకుండా సహాయం చేసినా తనని ఆ విధంగా మోసం చేసినందుకు బాధపడ్డాడు. ఇవ్వలేకపోయినా కనీసం మాట మాత్రమేనా చెప్పరాదా అనుకునేవాడు.

ఆ రోజు సాయంత్రం ఐదు గంటలు దాటింది. ఆఫీసు వదిలిపెట్టారు. నరసింహం ఇంటికి బయలుదేరాడు. ఆఫీసు బయట కొంచెం దూరంలోనే రోడ్డు మీద ఏదో గలభా జరుగుతోంది. ఆఫీసు వాళ్లు కూడా చాలా మంది ఉన్నా రక్కడ.

ఏమిటా అని ఆగి చూశాడు నరసింహం. అతని గుండె జల్లుమంది. ఆ జనం మధ్యన రంగారావు నేరస్థుడిలాగా నిలబడి ఉన్నాడు. జనాన్ని చూడలేక తల దించుకున్నాడు. ఒక సర్దార్జీ అతని చొక్కాను మెడ కింద మెలివేసి గట్టిగా పట్టుకుని ఉన్నాడు.

"అరే హరాంకే బేటే.. నమ్మక్‌హరాం... ధోకా ఇస్తావ్! ఎల్లుండిలోగా నా పైసలు ఇవ్వకుంటే నీ కాళ్లూ, చేతులూ విరక్కొట్టేస్తాను. బట్టలు విప్పి బయట నిలబెడతాను" అని అరుస్తున్నాడు ఆ సర్దార్జీ కళ్ల వెంట నిప్పులు కురిపిస్తూ.

ఆఫీసు వాళ్లు ఎందరో అక్కడున్నా ఎవరూ కల్పించుకోనేలేదు. వింత చూస్తున్నట్లుగా నిలబడిపోయారు.

ఆ దృశ్యం చూసేసరికి నరసింహానికి మతిపోయింది.

అతను సెక్షన్ ఆఫీసర్ కావడం వల్ల, అతను రాగానే మిగిలినవారు దారి ఇచ్చారు.

"సర్దార్జీ! ఏమిటిది? ఏం జరిగింది?" అంటూ గట్టిగా అరిచాడు నరసింహం.

అతని గొంతు వినగానే రంగారావు చొక్కాను వదిలేశాడు సర్దార్జీ. అతనికి నరసింహం ఎవరో తెలుసు. అందుకని — "చూడండి సాబ్! బాకీ పైసలు ఇవ్వడానికి గోల్ ఫిరాయిస్తున్నాడు" అన్నాడు.

"అయితే మాత్రం ఇలా నలుగురిలో అల్లరి చేస్తారా? మీరు అతన్ని వదిలి వెళ్లిపొండి. అతనితో నేను మాట్లాడి పైసలు చేస్తాను" అన్నాడు.

"అచ్చా సాబ్! మీరు చెప్తే నా కింక ఫికరేమి ఉంది!" అంటూ సర్దార్జీ వెళ్లిపోయాడు.

"రంగారావూ! పోదాంరా" అన్నాడు నరసింహం దారితీస్తూ.

మౌనంగా అనుసరించాడు రంగారావు తల దించుకునే.

జనం ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

ఇద్దరూ వెళ్లి దగ్గరలో ఉన్న పార్కులో ఓ మూల బెంచీ మీద కూర్చున్నారు.

"రంగారావు ఏమిటిది? ఏం జరిగింది?" అని అడిగాడు నరసింహం.

ఏమీ చెప్పలేక చేతి రుమాలు ముఖం మీద వేసుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు రంగారావు.

నరసింహం అతని భుజాన్ని తడుతూ ఓదార్చాడు.

కొంచెం సేపటికి తెప్పరిల్లాడు రంగారావు. "ఏం చెప్పను, బ్రదర్! వాడికి నేను బాకీ ఉన్నాను. వడ్డీ ఇవ్వలేదని ఇంత అల్లరి పెట్టాడు" అన్నాడు.

"ఎంతివ్వాలేమిటి?"

"అసలు మూడు వందలు. నెలనెలా అరవై రూపాయలు వడ్డీ ఇవ్వాలి."

"అరవై రూపాయలే! అంటే నెలకి నూటికి ఇరవై రూపాయలే!" అంటూ గుండె బాదుకున్నాడు నరసింహం.

"అవును బ్రదర్" అన్నాడు రంగారావు.

"చూడు రంగారావు! నువ్వూ, నేనూ ఒకేసారి ఉద్యోగంలో చేరాం. నేను ప్రమోషన్ వచ్చి సెక్షన్ ఆఫీసర్‌నయ్యాను. నీ అప్పుల మూలంగా నీకు కోర్టు అటాచిమెంట్‌లు రావడం వల్ల నీకు ప్రమోషన్ రాకుండా ఇంకా గుమస్తాగానే ఉండిపోయావు. అది అలా ఉంచు. ఉన్న జీతంలో సర్దుకోవాలిగాని ఈ అప్పులేమిటి? ఈ వడ్డీ లేమిటి? ఈ అవమానాలేమిటి? ఇలాగైతే చివరికి ఏ నుయ్యో, గొయ్యో చూసుకోవలసి వస్తుంది."

"ఆ రోజు ఎంతో దూరంలో లేదు బ్రదర్! నేను అంతకంతకు ఊబిలో దిగిపోతున్నాను. బయటికి రావాలని ఎంతగా ప్రయత్నిస్తే అంత లోతుగా కూరుకుపోతున్నాను" అని అంటుండగానే తిరిగి గొంతు జీరబోయి కన్నీళ్లు తిరగాయి రంగారావుకి.

"అలా అధైర్యపడకు. చచ్చి సాధించేదేముంది బ్రతికి బాగుపడాలి కాని. ఇంతకీ నీకు అప్పులు మొత్తం ఎన్ని ఉన్నాయి?"

నీకియ్యాల్సిన దాంతో కలిపి మూడువేల వరకూ ఉంటుంది."

"నాది సరేలే. మిగతా వాటికిగాను నెలనెలా ఎంత వడ్డీ కడుతున్నావు?"

"ఐదు వందలు పైనే కడుతున్నాను."

"అప్పుల వాళ్లు ఎంత మంది ఉంటారు?"

"ఏడెనిమిది మంది ఉంటారు."

నరసింహం ఒక్క నిముషం మౌనంగా ఉన్నాడు. తర్వాత "సరే. ఒక పని చేయి. ఇన్నిచోట్ల అప్పులు చేసి ఇంతమంది చేత మాటలు, అవమానాలు పడడం బాగాలేదు. మొత్తం అప్పు ఒకే చోటుంటే బాగుంటుంది. నేను చెప్పినట్లు చేస్తావా?" అన్నాడు

"అంతకంటేనే. నువ్వు గంగలో మునగమన్నా మునుగుతాను."

"అంత పని వద్దులే. నువ్వు మునిగిపోకుండా తేలాలనేగా నా ప్రయత్నం. నాకు ఒక మార్వాడీ స్నేహితుడున్నాడు.

వాడు సర్దార్జీలను, కాబూలీ వాళ్లను మించినవాడు. మాట తప్పితే ప్రాణాలు తీస్తాడు. అయితే నేనంటే వాడికి చాలా గౌరవం. వాడి దగ్గర్నుంచి మూడు వేలు తీసుకు వస్తాను. ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలో దాచకుండా చెప్పు. అవన్నీ నేను దగ్గరుండి తీరుస్తాను. ఇంక కొత్త అప్పులు చెయ్యకు. నెల నెలా నువ్వు వడ్డీ కరెక్టుగా ఇచ్చేయి. అతనికి నీ సర్దార్జీ మల్లే పది రూపాయల వడ్డీ అక్కర లేదు. నెలకి ఐదు రూపాయలు ఇవ్వు చాలు. అంటే నెలకి 150 ఇస్తే చాలు. ఇచ్చిన మొత్తానికి ప్రోనోటు రాసివ్వు. ఇది నీ కిష్టమేనా?"

"నేను మాట తప్పినా, నా మీద నమ్మకముంచి నన్ను గట్టెక్కించడానికి దేవుడల్లే నువ్వు వస్తుంటే కాదని అంటానా. అలాగే చేస్తాను."

"నాకు నీ మీద నమ్మకం కలిగి ఇది నేను చేయడం లేదు. ఈ రోజున నువ్వు అప్పులవాళ్ల వల్ల పడ్డ అవమానం చూసి భరించలేక ఈ రిస్క్ తీసుకుంటున్నాను. ఇంతటి రిస్క్ తీసుకున్నందుకు నిత్యమూ నేను పశ్చాత్తాప పడేటట్లు మాత్రం చేయకు. ఆ మార్వాడీ సామాన్యుడు కాడని ముందే చెప్పానుగా. ఒక్క నెల అయినా మాట తప్పావో నిన్నూ, ఇప్పించినందుకు నన్నూ నిలువునా చీల్చేస్తాడు. సర్దార్జీలాగా కేవలం చొక్కా పట్టుకునే రకం కాదు."

"అటువంటి పరిస్థితి రానీయనని నా భార్యా బిడ్డల మీద ఒట్టేసి చెప్తున్నాను బ్రదర్."

"సరే. ఇంక పోదాం పద. ఆలస్యం అయింది" అంటూ లేచాడు నరసింహం.

మర్నాడు నరసింహం తాను పొదుపుగా దాచుకున్న డబ్బుల్లోంచి మూడు వేలు తెచ్చి అన్న ప్రకారం తాను దగ్గరుండి రంగారావు బాకీలన్నీ తీర్చాడు.



## కాస్టాఫ్ లివ్వింగ్

జెనరల్ మేనేజర్: నీకు ఇంకా వివాహం కాలేదు కదా! మరి జీతం చాలటం లేదని గొడవ పెడుతున్నావేమిటి?

క్లర్క్: కాస్ట్ ఆఫ్ లివ్వింగ్ ఎక్కువయిపోయింది సార్.

ముద్దా రమణమూర్తి (అనంతపురం)

---

నెలలు త్వరత్వరగా గడిచిపోతున్నాయి. రంగారావు అన్న ప్రకారం ప్రతి నెలా వడ్డీ కింద నూట యాభై రూపాయలు క్రమం తప్పకుండా నరసింహానికి ఇచ్చేస్తున్నాడు. అతనిలో నవచైతన్యం కనిపిస్తోంది. అతనిలో వచ్చిన మార్పుని గమనించి చాలా సంతోషించాడు నరసింహం.

చూస్తుండగా మూడేళ్లు గడిచిపోయింది.

ఆ రోజు నరసింహం రంగారావుని తన ఇంటికి తీసుకువెళ్లాడు.

"రంగారావు! ఇంకెంత కాలం వడ్డీ కడతావయ్యా? అసలు తీర్చేయరాదు?"

"అది నా తరం కాదు బ్రదర్."

"పోనీ బాకీ ఎగవేయి. ఆ మార్వాడీ వాళ్ల దేశం వెళ్లాడు. కొన్ని నెలలకు కానీ రాడు. వచ్చి అడిగినా అసలు ఎప్పుడో తీరింది. అంతకంటే ఎక్కువే వడ్డీ ఇచ్చాను అనొచ్చు."

"ఎంతమాట! నా ప్రాణం పోయినా సరే కాని నీకు మాత్రం మాట రానివ్వను. నన్ను పరీక్షించడానికి కాకపోతే ఏమిటీ మాటలు" అన్నాడు రంగారావు బాధగా.

దగ్గరకు వచ్చి ఆప్యాయంగా రంగారావు భుజాలు నొక్కాడు నరసింహం.

"ఇంక నువ్వు బాకీ తీర్చనక్కరలేదు. అది ఏనాడో తీరిపోయింది. ఇప్పుడు నేనే నీకు బాకీ ఉన్నాను" అన్నాడు చిరునవ్వు నవ్వి.

ఏమీ అర్థంకాక చూడసాగాడు రంగారావు.

"అవును. నెలకు నూట యాభై రూపాయల చొప్పున అసలు ఇరవై నెలలోనే తీరిపోయింది. ఆపైన పదహారు నెలలకి రెండు వేల నాలుగు వందలు జమ అయింది. ఇదుగో ఆ డబ్బు. తీసుకో" అంటూ డబ్బు తీసి ఇచ్చాడు నరసింహం.

"నువ్వు చెప్పేది నాకేమీ అర్థం కావడంలేదు" అన్నాడు బుర్ర గోక్కుంటూ.

"ఆ మార్వాడీ ఎవరో కాదు. నేనే. వడ్డీ లేకుండా సహాయంగా ఇచ్చిన డబ్బుకు విలువ ఉండదు. అందుకే నువ్వు నా బాకీ తీర్చలేకపోయావు. వడ్డీ అనేసరికి చచ్చినట్లు ఇచ్చుకుంటున్నావు. నీలో అప్పులు చేసే లక్షణం పోయి ఉన్న దాంట్లో సర్దుకునే లక్షణం కలిగినందువల్ల ఈ రహస్యం బయటపెట్టాను. ఈ డబ్బుకి మరికొంత కలిపి ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసుకో. నెల నెలా కొంత వడ్డీ వస్తుంది. ఇది కాక ఇప్పుడిస్తున్న వడ్డీ నూట యాభై రూపాయలను చిట్ ఫండ్‌లో కాని, రికరింగ్ డిపాజిట్‌లో కాని వేయి. ఆ డబ్బు నీ అవసరానికి ఆదుకుంటుంది. నీ గౌరవాన్ని పెంచుతుంది కూడా" అన్నాడు నరసింహం.

ఆశ్చర్యంతో శిలా విగ్రహంలా మ్రాన్పడిపోయాడు రంగారావు. కొంచెం సేపట్లో తేరుకుని అమాంతం నరసింహం పాదాల మీద పడ్డాడు. అశ్రువులతో మిత్రునికి పాదాభిషేకం చేశాడు.

నరసింహం అతన్ని ఆప్యాయంగా లేవనెత్తాడు.

◆

